## క్లుప్తంగా

### నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ కండక్టర్


ప్రయాణికురాలికి నగదు, సెల్‌ఫోన్ అందిస్తున్న ఆర్టీసీ అధికారులు

**ధర్మవరం అర్బన్:** ఆర్టీసీ బస్సులో పోగుట్టుకున్న సెల్‌ఫోన్, డబ్బును తిరిగి ప్రయాణికురాలికి అందజేసి కండక్టర్ నిజాయితీ చాటుకున్నారు. వివరాలు.. ధర్మవరం పట్టణానికి చెందిన త్రివేణి ఈనెల 18వ తేదీన అనంతపురం వెళ్లేందుకు నంద్యాల డిపో బస్సు ఎక్కారు. రూ.15 వేలు విలువ చేసే సెల్‌ఫోన్, రూ.11 వేల నగదు ఉన్న పర్సును బస్సులో పోగొట్టుకుంది. గమనించిన తోటి ప్రయాణికులు సెల్‌ఫోన్, నగదును బస్సు కండక్టర్ పోతిరెడ్డికి అప్పగించారు. అనంతరం ఆయన బస్టాండ్‌లో ఆర్టీసీ అధికారులకు పర్సు, సెల్‌ఫోన్ అందజేశారు. ఆదివారం ప్రయాణికురాలి అడ్రస్ తెలుసుకున్న అధికారులు ఆమెను ఆర్టీసీ బస్టాండుకు పిలిపించారు. ఆమెకు పర్సుతోపాటు సెల్‌ఫోన్ అప్పగించారు. నిజాయతీ చాటుకున్న కండక్టర్‌ను ఆర్టీసీ అధికారులు అభినందించారు.

### సహకార బ్యాంకులో విరివిగా రుణాలు


జెండాను ఆవిష్కరిస్తున్న సహకార బ్యాంకు సిబ్బంది

**అమడగూరు:** సహకార బ్యాంకులో రైతులు, మహిళలు, యువతకు తక్కువ వడ్డీకే రుణాలు ఇస్తున్నట్లు బ్యాంకు సీఈఓ పద్మనాభరావు పేర్కొన్నారు. ఆదివారం బ్యాంకులో సహకార బ్యాంకు వారోత్సవాలను నిర్వహించారు. ముందుగా బ్యాంకు ఆవరణలో జెండాను ఆవిష్కరించారు. జాతీయగీతాన్ని ఆలపించారు. అనంతరం బ్యాంకు సిబ్బంది మాట్లాడుతూ.. బ్యాంకు ద్వారా ఇప్పటి వరకూ మంజూరు చేసిన రుణాలు, రికవరీ మొత్తాలను చదివి వినిపించారు. అలాగే అన్ని బ్యాంకుల కంటే తక్కువ వడ్డీకే రుణాలను ఇస్తున్నామని తెలిపారు. అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### శుభకార్యం

**నల్లమాడ:** రెడ్డిపల్లికి చెందిన టి.నాగిరెడ్డి కుమారుడు కొండారెడ్డి వివాహం ప్రియాంక రెడ్డితో ఆదివారం జరిగింది. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తండ్రి, వైఎస్సార్‌సీపీ నేత దుద్దుకుంట వెంకట్రామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కే.సూర్యనారాయణ, రెడ్డిపల్లి సర్పంచ్ ప్రసాద్, నాయకులు యర్ర సూరి, షరీఫ్, బాబావలి, చిన్నపరెడ్డి పాల్గొన్నారు. అలాగే ఎన్.ఎనుమలవారిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రెడ్డిశేఖర్ కుమార్తె, కుమారుడు తలనీలాల కార్యక్రమానికి దుద్దుకుంట వెంకట్రామిరెడ్డి హాజరై చిన్నారులను ఆశీర్వదించారు.

### అన్నదానానికి విరాళం


అయ్యప్ప సేవా సమితికి విరాళం అందజేస్తున్న దాతలు

**కదిరి టౌన్:** స్థానిక అయ్యప్ప స్వామి ఆలయంలో అన్నదాన కార్యక్రమానికి పట్టణానికి చెందిన ఎం.పరంజ్యోతి, ఎం.క్రిష్ణయ్య (బ్యాంక్ స్వామి) ఆదివారం రూ.1,01,118 విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ.. అయ్యప్ప మాల ధారులకు అన్నదానం చేసే అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. మండలాల నుంచి అయ్యప్పలు కదిరికి అయ్యప్ప స్వామి గుడికి వచ్చి భోజనం చేసి వెళ్తున్నారని పేర్కొన్నారు.

### ఉచిత మెగా వైద్య శిబిరానికి స్పందన


రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

**ధర్మవరం అర్బన్:** యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి స్పందన లభించిందని యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు వైకే శ్రీనివాసులు, కార్యదర్శి సుకుమార్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. కావేరి ఆసుపత్రి వారి సౌజన్యంతో యురాలజిస్టు, కార్డియాలజిస్టు, ఆర్థోపెడిక్ సర్జన్ తదితర వైద్య నిపుణులు ప్రజలకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో యువర్స్ ఫౌండేషన్ సభ్యులు చాంద్‌బాషా, డాక్టర్ బీవీ సుబ్బారావు, రాధాకృష్ణ, బండి నాగేంద్ర, జయరాం, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# కార్తీకం.. దేదీప్యం


ముస్తాబైన బత్తలపల్లిలోని శివాలయం



బత్తలపల్లి, ముష్టూరులో పూజలందుకుంటున్న శివుడు

- ఆలయాలకు ఆధ్యాత్మిక శోభ

**బత్తలపల్లి:** కార్తీక మాసం శివ, విష్ణువుకు ప్రీతికరమైంది. భక్తులు శివాలయాల్లో అభిషేకాలు, పూజలే కాక విష్ణు ప్రీతిగా తులసీ పూజలు కూడా చేస్తారు. చాలా మంది అయ్యప్ప స్వామి దీక్షలు కూడా ఈ మాసంలోనే స్వీకరిస్తారు. కార్తీక మాసం నెల రోజులు పర్వదినాలుగా గడుస్తాయి. బత్తలపల్లి మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలైన సంఘమేశ్వర క్షేత్రం, కాటికోటేశ్వర క్షేత్రంతో పాటు మండల కేంద్రంలోని లలితా త్రిపుర సుందరీ సమేతా ఓంకారేశ్వర దేవాలయం, పోట్లమర్రి, ముష్టూరులోని శివాలయాలు, గంటాపురం అప్పస్వామి, దంపెట్ల చెన్నకేశవాలయం, డి.చెర్లోపల్లి సిద్ధేశ్వరాలయం, గుమ్మల్లకుంట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయాల్లో కార్తీక పూజల కోసం ఏర్పాట్లు చేశారు. తాడిమర్రి మండలం ఏకపాదంపల్లిలో లక్ష్మీనరసింహ స్వామి ఆలయం, చిల్లవారిపల్లి కాటికోటేశ్వర క్షేత్రం, కునుకుంట్ల, తాడిమర్రి, చిల్లకొండయ్యపల్లి, దాడితోట శివాలయాలను ఇప్పటికే ముస్తాబు చేశారు.

**దైవరాధన ఇలా..**

కార్తీక మాసంలో ప్రతి సోమవారం శివుడి ఆరాధన విశిష్ట ఫలితం ఇస్తుందని పండితులు చెబుతారు. ఈనెల 23న వచ్చే ఏకాదశి నాడు సత్యనారాయణ పూజ, వ్రతం, 24న ద్వాదశి రోజు తులసీ పూజ చేస్తే సమస్త సౌభాగ్యాలు కలగడంతో పాటు అంత్యమున జన్మరాహిత్యం కలుగుతుందట. ఈనెల 27న కార్తీక పౌర్ణమి రోజున 365 దీపాలు వెలిగించి పూజలు చేస్తే ఏడాది పాటు చేసిన పూజఫలం సిద్ధిస్తుందని నమ్మకం. కార్తీక పౌర్ణమి రోజు శివాలయం ముందు దీపారాధన చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని పండితులు చెబుతున్నారు. కృత్రిక నక్షత్రం రోజున, సోమవారం నాడు, కార్తీక పున్నమి నాడు రుద్రాభిషేకం చేసి, బిల్వదళాలు, రుద్రాక్షలతో పూజించిన వారికి అనంత సౌభాగ్యాలతో పాటు అంత్యమున శివసాయుజ్యం పొందుతారని కార్తీక పురాణం చెబుతోంది.

**తులసీ కల్యాణం..**

కార్తీక మాసంలో తులసీ కళ్యాణం జరపడం విశేష పుణ్యప్రదం. తులసీదేవి జన్మదినం కార్తీక పౌర్ణమి. ఈ రోజు లక్ష్మీదేవి అంశ అయిన తులసి మొక్క వివాహం మహావిష్ణు రూపమైన అశ్వత్థవృక్షంతో జరపడం సాంప్రదాయం. (కొన్ని ప్రాంతాల్లో ఉసిరిక కొమ్మ, చెరుకుగడను కూడా అశ్వత్థ వృక్షానికి మారుగా వాడుతుంటారు) జన్మలో ఒకసారైనా ఈ కల్యాణం చూసి తీరాలని పెద్దలు చెబుతారు.

**దీపం.. దోష నివారణ**

కార్తీక పౌర్ణమి రోజు దీపాలు వెలిగించడం ద్వారా కొన్ని రకాల దోషాలను నివారించుకోవచ్చని కార్తీక పురాణం చెబుతోంది. రాహుదోషం తొలగి పోవాలంటే 21 దీపాలు, శనిదోషం పోవాలంటే 9 దీపాలను వెలిగించాలని పండితులు చెబుతున్నారు. అలాగే గురు దోషానికి 33, దుర్గాదేవికి 9, ఈశ్వరుడికి 11 దీపాలు, మాంగల్య దోషానికి 21, పుత్ర దోషానికి 51, సర్పదోషానికి 48, కాల సర్పదోషానికి కళత్ర దోషానికి 108 దీపాలను వెలిగించడం మంచిది. దీపారాధనకు దూది ఒత్తులను ఉపయోగిస్తే వంశాభివృద్ధికి, శుభ ఫలితాలు చేకూరతాయి. అరటి, తామరవత్తులను ఉపయోగిస్తే పుత్రశాపం తొలగి పాపాలు హరిస్తాయని నమ్మకం. కార్తీక పౌర్ణమి రోజు సాయంత్రం ఆరు గంటల నుంచి తొమ్మిది గంటల మధ్య మాత్రమే మట్టి ప్రమిదలలో దీపాలను వెలిగించాలి.

### శివుడు పరవశిస్తాడు

కార్తీక మాసంలో భక్తులు చేసే పూజలు, అభిషేకాలకు ఆ పరమశివుడు పరవశించిపోతాడు. భక్తులు ఆచరించే నియమ నిబంధనల్లో కచ్చితత్వం పాటించి దీపారాధన చేస్తే అజ్ఞానం తొలగి జ్ఞానాన్ని పొందవచ్చు. సాలగ్రామ దానం, గోదానం, స్వయపాకదానం, సత్యనారాయణ వ్రతం, కేదారేశ్వర వ్రతంతో పాటు రుద్రాభిషేకం, మహాలింగార్చన చేస్తే పుణ్యం పొందవచ్చు.

– చంద్రశేఖర్ శర్మ, అర్చకుడు, ముష్టూరు

### పవిత్రమైన మాసం

కార్తీక మాసానికి పురాణాల్లో సైతం ఎంతో పవిత్రత ఉంది. శివునికి ప్రీతిపాత్రమైన మాసం కార్తీక మాసం. మహిళా భక్తులు భక్తిశ్రద్ధలతో దీపాలు వెలిగిస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయి. మహిళలకు ఎంతో ప్రాముఖ్యత కలిగిన కార్తీక మాసంలో శివుడిని ఆరాధిస్తే ఫలితం ఉంటుంది. కోరిన కోర్కెలు తీరడంతో పాటు మాంగల్య బలం పెరుగుతుందని నమ్మకం. ఆయా గ్రామాల్లోని శివాలయాలకు వెళ్లి దీపాలు వెలిగించాలి.

– కేశవస్వామి, ప్రధాన అర్చకుడు, బత్తలపల్లి

### సత్యసాయి సన్నిధిలో కేంద్ర మంత్రి


సత్యసాయి మహాసమాధికి పూజలు చేస్తున్న కేంద్ర మంత్రి శోభా కరంద్లాజే

**ప్రశాంతి నిలయం:** సత్యసాయి మహాసమాధిని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే ఆదివారం దర్శించుకున్నారు. సత్యసాయి 98వ జయంతి వేడుకల్లో పాల్గొనేందుకు రోడ్డు మార్గంలో పుట్టపర్తికి విచ్చేసిన ఆమె సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధికి పూజలు చేశారు. అంతకుముందు కేంద్ర మంత్రికి సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు ప్రశాంతి నిలయంలో ఘనంగా స్వాగతం పలికారు.

### నేడు 'స్పందన'

- హాజరుకానున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

**గాండ్లపెంట:** స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరగనుంది. ఉదయం 11 గంటలకు ఎమ్మెల్యే డా.పి.వి సిద్దారెడ్డి కార్యక్రమంలో పాల్గొంటారని పార్టీ మండల కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యలను స్పందన కార్యక్రమంలో తెలియపరిచి పరిష్కరించుకోవాలని కోరారు.

**బత్తలపల్లి:** మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో సోమవారం స్పందన కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ యుగేశ్వరిదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 11 గ్రామ సచివాలయాల్లో సచివాలయ ఉద్యోగులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారన్నారు. అదే విధంగా మండలస్థాయిలో జరిగే స్పందన కార్యక్రమానికి మండలస్థాయి అధికారులందరూ హాజరు కావాలని సూచించారు. ప్రజలు కూడా ఏవైనా సమస్యలుంటే వినతిపత్రాలను అందజేయవచ్చన్నారు.

### వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

**తనకల్లు:** భర్త వేధింపులు తాళలేక లావణ్య (21) అనే వివాహిత ఆదివారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక సాయిబాబా గుడి వద్ద నివాసం ఉంటున్న సోమశేఖర్‌కు నాలుగేళ్ల క్రితం లావణ్యతో వివాహం అయింది. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. అయితే ఇటీవల భర్త సోమశేఖర్‌తో పాటు కుటుంబ సభ్యులు వేధింపులకు పాల్పడుతున్నట్లు లావణ్య తండ్రి చలపతికి తెలిపింది. వేధింపులు ఎక్కువ కావడంతో భరించలేక ఆదివారం లావణ్య ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. గమనించిన భర్త సోమశేఖర్ ఆమెను చికిత్స కోసం 30 పడకల ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లాడు. అయితే ఆమె అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



ధర్మవరంలో ఇందిరా గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం, ఎన్‌పీకుంటలో..

**బత్తలపల్లి/కదిరి అర్బన్/ఎన్‌పీకుంట/పుట్టపర్తి టౌన్/కదిరి టౌన్/ధర్మవరం/నల్లమాడ/తాడిమర్రి:** ధర్మవరం, కదిరి, పుట్టపర్తి నియోజకవర్గాల్లో ఆదివారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు కొనసాగాయి. ఆయా మండలాల్లోని శాఖా గ్రంథాలయాల్లో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ అధికారులు మాట్లాడుతూ.. నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారన్నారు. ఇందిరా గాంధీని స్ఫూర్తిగా తీసుకొని ధైర్య సాహసాలు ప్రదర్శించాలని సూచించారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను, లైంగిక దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం దిశా చట్టం రూపొందించిందని తెలిపారు. ప్రతి మహిళ దిశా చట్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో బత్తలపల్లి, కదిరి, ఎన్‌పీకుంట, పుట్టపర్తి, నల్లమాడ, ధర్మవరం, తాడిమర్రి గ్రంథాలయ అధికారులు రాజేశ్వరి, క్రిష్ణకిషోర్ రెడ్డి, శాంతమ్మ, ఆంజనేయులు, శకుంతాబాయి, అంజలి సౌభాగ్యవతి, రేనా నాయక్, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## సంఘాన్ని తప్పుదోవ పట్టించొద్దు


మాట్లాడుతున్న పత్ర కుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణమూర్తి

**కదిరి టౌన్:** పట్టణంలోని ఎన్జీఓ హోంలో ఆదివారం ఏపీ పత్ర కుల సంక్షేమ సంఘం రాష్ట్ర నూతన కమిటీ పరిచయ వేదిక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పత్ర కుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణమూర్తి మాట్లాడుతూ.. పత్ర కులస్తులను ఓసీ నుంచి బీసీ–ఏలోకి మార్చడానికి జస్టిస్ దళవాయి సుబ్రహ్మణ్యం కమిషన్ రాష్ట్రంలో పర్యటించిందన్నారు. బీసీ–ఏలోకి చేర్చడానికి సంఘం నాయకులు కృషి చేయడం జరిగిందన్నారు. కులం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతూ ముందుకు పోతుంటే కొంతమంది మాత్రం కేవలం సోషల్ మీడియా ద్వారా పత్ర సంఘానికి తామే అధ్యక్షులు అంటూ పోస్టులు పెట్టడం సరికాదన్నారు. సంఘాన్ని తప్పుదోవ పట్టించేలా కార్యక్రమాలు చేపట్టడం చాలా బాధాకరమన్నారు.

### కోటి లింగాలకు ప్రత్యేక బస్సులు


కోటిలింగాల యాత్రకు బయలు దేరుతున్న భక్తులు

**హిందూపురం:** కార్తీక మాసం సందర్భంగా హిందూపురం నుంచి కోటిలింగాలు, అరుణాచలం క్షేత్రం దర్శనానికి ప్రత్యేక బస్సు సర్వీసులు ప్రారంభమయ్యాయి. ఆదివారం హిందూపురం ఆర్టీసీ బస్టాండ్ నుంచి రెండు ప్రత్యేక సర్వీసులు నడిపిస్తున్నారు. ఈ సందర్భంగా కర్ణాటక రాష్ట్రంలోని చిక్‌బళ్లాపురం వద్ద ఈషా ఫౌండేషన్, కోటిలింగాల దర్శనానికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ డీఎం హంపన్న తెలిపారు. హిందూపురం, కోటిలింగాలు, ములబాగుల ఆంజనేయస్వామి, బంగారు తిరుపతి దేవస్థానాలను చూపించడం జరుగుతుందన్నారు. ఇందుకు రూ.650 చార్జీ ఉంటుందన్నారు. అలాగే ఆదివారం సాయంత్రం అరుణచలం క్షేత్ర దర్శనంకు కూడా ప్రత్యేక బస్సు ఏర్పాటు చేశామన్నారు. దర్శనానికి తరలివెళ్లే వారు ఫోన్ నంబర్ 9440834715కు ఫోన్ చేసి టికెట్లు రిజర్వు చేసుకోవాలన్నారు.

### కంటిచూపుపై అశ్రద్ధ వహించొద్దు


కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ నరసింహులు

**ధర్మవరం అర్బన్:** షుగర్ వ్యాధిగ్రస్తులు కంటిచూపును నిర్లక్ష్యం చేయకూడదని కంటి వైద్య నిపుణుడు డాక్టర్ నరసింహులు సూచించారు. పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీలో ఉన్న మధు కంటి ఆసుపత్రిలో ఆదివారం చక్కెర వ్యాధిగ్రస్తులకు ఉచిత కంటి రెటీనా పరీక్ష శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు మాట్లాడుతూ.. షుగర్ వ్యాధిగ్రస్తులకు ముఖ్యంగా కంటిచూపు త్వరగా తగ్గుతుందన్నారు. ఎప్పటికప్పుడు కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ వైద్య శిబిరంలో 53 మందికి కంటి పరీక్షలు చేశారు.

## వేరుశనగకు ఆవుల బెడద


ధ్వంసమైన వేరుశనగ పంటను చూపుతున్న రైతు

**ఎన్‌పీకుంట:** మండల పరిధిలోని మరికొమ్మదిన్నె గ్రామానికి చెందిన రైతు సుబ్బారెడ్డి రబీలో సాగు చేసిన వేరుశనగ పంటను ఆవుల మంద ధ్వంసం చేస్తోంది. రైతు తనకున్న సుమారు 14 ఎకరాల పొలంలో నెల క్రితం వేరుశనగ సాగు చేశాడు. పంట సాగు చేసినప్పటి నుంచి పంటపై ఆవుల దాడి ఎక్కువగా ఉందని రైతు తెలిపాడు. ఆవుల యజమానుల దృష్టికి తీసుకెళ్లినా వారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. కడప జిల్లా కాట్రగంటవారిపల్లికి చెందిన సుధాకర్ నాయుడుకు చెందిన ఆవులు పంటను నాశనం చేస్తున్నాయంటూ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ చేసి, చర్యలు చేపడతామని పోలీసులు తెలిపారు.

## భక్తుల సౌకర్యమే పరమావధి


భక్తుల సౌకర్యార్థం బగ్గీని ప్రారంభిస్తున్న ఆర్‌జే రత్నాకర్ రాజు

**ప్రశాంతి నిలయం:** ప్రశాంతి నిలయానికి వివిధ ప్రాంతాల నుంచి సత్యసాయి మహాసమాధి దర్శనం కోసం వచ్చే భక్తుల సౌకర్యమే పరమావధిగా ట్రస్ట్ పని చేస్తోందని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు పేర్కొన్నారు. ప్రశాంతి నిలయానికి చేరుకునే భక్తులను ప్రశాంతి నిలయం తూర్పు ద్వారం నుంచి విడిది చేసే సాయి భక్తనివాస్‌కు చేర్చేందుకు వీలుగా బ్యాటరీతో నడిచే 12 సీట్ల బగ్గీని సత్యసాయి భక్తులు సత్యసాయి ట్రస్ట్‌కు అందజేశారు.

ఈ వాహనాన్ని ఆదివారం ఆర్‌జే రత్నాకర్ రాజు ప్రారంభించారు. భక్తుల సౌకర్యార్థం బగ్గీని అందజేయడం అభినందించదగ్గ విషయమన్నారు. సత్యసాయి బోధనల మేరకు భక్తులు సేవా మార్గంలో నడవాలని కోరారు.

## వైఎస్ జగన్‌ను ఆశీర్వదించండి

**తలుపుల:** టీడీపీ, వైఎస్సార్‌సీపీ పాలనలో తేడాను గమనించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని 6వ వార్డులో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటా ప్రచారం చేశారు. వైఎస్సార్‌సీపీ హయాంలో వివిధ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. జగనన్న పాలనలో సంతోషంగా ఉన్నామని లబ్ధిదారులు తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఫయాజ్ అహమ్మద్, ఎంపీపీ రఫీనాయక్, సేవాదళ్ జోనల్ ఇన్‌చార్జి డీకేబాబు, వార్డు మెంబర్లు మౌలా, చంద్ర, ఉసేన్‌మియా, గౌస్‌పీర్ పాల్గొన్నారు.

**నేడు పోట్లమర్రిలో 'వై ఏపీ నీడ్స్ జగన్'**

**బత్తలపల్లి:** మండలంలోని పోట్లమర్రి గ్రామ సచివాలయ పరిధిలో సోమవారం సాయంత్రం 3 గంటలకు 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ బగ్గిరి త్రివేణి, జెడ్పీటీసీ కోటి సుధ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొనాలని కోరారు.

### కుటుంబ సమస్యలతో మహిళ ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న జాను

**ధర్మవరం అర్బన్:** పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురానికి చెందిన మొహమ్మద్ భార్య జాను ఆదివారం సాయంత్రం విష ద్రావకం తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... భర్త మొహమ్మద్, భార్య జాను గొడవపడ్డారు. దీంతో మనస్థాపానికి గురైన జాను ఇంట్లోని విషద్రావకం తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### ఆర్డీటీ పాఠశాలకు విరాళం

**కదిరి అర్బన్:** మండల పరిధిలోని మొటుకుపల్లి ఆర్డీటీ దివ్యాంగ పాఠశాలకు ఆదివారం అనంతపురానికి చెందిన రత్నమ్మ తన భర్త రామయ్య జ్ఞాపకార్థం రూ.10 వేలు విరాళంగా అందజేశారు. ఆర్డీటీ సెక్టార్ టీంలీడర్ కేశవమూర్తి మాట్లాడుతూ.. ఆర్డీటీ దివ్యాంగ విద్యార్థులకు హరిమోహన్ కుటుంబ సభ్యులు విరాళం అందించడం హర్షణీయమన్నారు.

### బీసీ హాస్టల్ తనిఖీ


మాట్లాడుతున్న సాంఘిక సంక్షేమ శాఖ డీడీ శివరంగ ప్రసాద్

**పరిగి:** మండల కేంద్రంలోని పరిగిలో బీసీ హాస్టల్‌ను ఆదివారం సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ శివరంగ ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. హిందూపురం పర్యటనలో భాగంగా ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రభుత్వం అందిస్తున్న విద్యా కానుక కిట్లతో పాటూ ఇతరత్ర వసతులు అందాయా అని ఆరా తీశారు. అదే విధంగా హాస్టల్లో ఉన్న మౌలిక వసతులు, తాగునీరు, భోజనం తదితర విషయాలను ప్రతి విద్యార్థితో అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వార్డెన్ వీరనారాయణను అభినందించారు. కార్యక్రమంలో హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

### వలంటీర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

**నల్లచెరువు:** మండల పరిధిలోని తలమర్లవాండ్లపల్లి గ్రామ సచివాలయ పరిధిలో పలు కారణాలతో ఖాళీగా ఏర్పడిన వలంటీర్ పోస్టుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ శకుంతల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### వైఎస్సార్ విగ్రహావిష్కరణకు ఏర్పాట్లు

**అనంతపురం:** శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో దివంగత ముఖ్యమంత్రి, డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహావిష్కరణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. క్యాంటీన్‌కు సమీపంలోని సర్కిల్‌లో వైఎస్సార్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రదాత అయిన డాక్టర్ వైఎస్సార్ విగ్రహం ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరారు. ఆదివారం విగ్రహ ఏర్పాటు స్థలానికి విగ్రహాన్ని తెచ్చారు. వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి ఉదయం నుంచి అక్కడే ఉండి ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య, మాజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్ . శంకర్ నాయక్, సూపరింటెండెంటింగ్ ఇంజినీర్ వి.మధుసూదన్ రెడ్డి, వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ లింగారెడ్డి పాల్గొన్నారు.

### త్రుటిలో తప్పిన ప్రమాదం

**పెనుకొండ రూరల్:** పెనుకొండ 44వ జాతీయ రహదారి హరిపురం వై జంక్షన్ వద్ద ఆదివారం మూడు కార్లు ఢీ కొన్నాయి. స్థానికుల వివరాలమేరకు బెంగళూరు నుంచి అనంతపురం వైపు వెళ్తున్న కారు హరిపురం వై జంక్షన్ స్పీడు బ్రేకర్లు వద్దకు రాగానే డ్రైవర్ వేగాన్ని నియంత్రించాడు. అదే క్రమంలో విజయవాడ వెళ్తున్న మరో కారు, ఆ వెంటనే మరోకారు ఒకదాని వెనుక మరోటి ఢీ కొన్నాయి. అయితే ఎవరికీ గాయాలు కాలేదు.